# నైలాన్ చీర

## చివుకుల పురుషోత్తం



“నైలాన్ చీర అందంగా ఉంటుంది. ఉతుక్కోవడానికి సులువు. కట్టుకొన్నమనిషికి హోదాతెస్తుంది. అందాన్నిస్తుంది. అంతేగాక యింకా........”

ఆ ఆఫీస్‌లో ఒక లేడీ క్లర్క్ ఉంది. ఆవిడ పేరు చాలా మందికి తెలియదు. కానీ నైలాన్ చీర, అంటే, అందరికీ తెలుసు, నిజానికి ఆవిడ పేరు భారతి.

భారతికి పాతిక సంవత్సరాల వయస్సు. కను ముక్కుతీరు చాలా అందంగా ఉంటుంది. పచ్చని దేహ చాయ, పొడవాటిజడ, స్వచ్ఛతను వెలిగ్రక్కే కళ్లు; గలగల మాట్లాడే తత్వంతో, ఆఫీసులో అందర్నీ ఆకర్షించింది.

ఆ ఆఫీసులో ఉన్న పదిమంది క్లర్క్స్‌లో ముగ్గురు మాత్రమే ఆడవాళ్లు. ఇద్దరు వివాహితలు. ఒకమ్మాయిః పెండ్లి కాలేదు. ఆ ముగ్గురిలోనూ అందకత్తె భారతి. భారతి వివాహిత. కానీ అందరిలాంటి వివాహిత ఐతే భారతిని ఎవ్వరూ పట్టించుకోక పోయేవారే. భారతి భర్త నిరుద్యోగి కుంటివాడు. భారతి భర్త రామారావుకు, కుడిచెయ్యి మోచేతికి పైన విరిగి పోయి ఉంటుంది.

ఆఫీసులో తెలిసినంతవరకూ. భారతిభర్త అప్రయోజకుడు; పెళ్ళాం సంపాదనమీద బ్రతుకుతుంటాడు. వారికి కలిగిన ఒకే ఒక్క రెండేండ్ల బిడ్డను పట్టుకొని, సాయంకాలం టంచన్‌గా అయిదింటికి ఆఫీసు ముందర హాజరౌతాడు.

ఆఫీసునుండి వెలుపలికి రాగానే, భారతి, భర్తచేతి బిడ్డనందుకుంటుంది. రామారావు, భారతిచేతి సంచిని అందుకుంటాడు. ఇద్దరూ అలాగా వెళ్లి ఒక హోటల్‌లో, కాఫీ త్రాగి, అలా బజారుకెళ్లి ఇంట్లోకి కావలసిన కూర గాయలు, సామానులు, కొనుక్కొని ఇంటి కెళ్తారు.

భారతి భర్త, ఇలా ఆఫీసు దగ్గరికి రావడంతో, భారతి ఆఫీసులోని వాళ్ళు, పనిగట్టుకొని, రామారావును పలుకరిస్తారు. రామారావు ఒక కార్టూనిస్టు. పత్రికలలో పడ్డ కార్టూనులవల్ల సరాసరి నెలకు ఇరవై ముప్ఫై రూపాయలు, అతడి సంపాదన.

రామారావు సంపాదనను గురించి ఆఫీసులో జోకులు వేస్తుంటారు. భారతి నైలాన్ చీర ప్రసక్తి తెచ్చినప్పుడల్లా అందరూ అంటారు, "చూస్తూండండి! ఒక రోజున మీయాయన ఒక బ్రహ్మాండమైన కార్టూన్ వేస్తారు. దాంతో వేలువచ్చిపడతాయి. ఆమెన ఓ అరడజన్ నైలాన్ చీరలు కొనుక్కోవచ్చు" అంటారు. భారతికి అందులోని ఎద్దేవ అర్థం అయినా, పట్టించుకోదు. నవ్వి పారేస్తుంది.

భారతి మట్టుకు, చేనేత చీరలు తప్ప రెండోవి వాడదు. ఆమె లేడీ కొలీగ్స్, నైలాన్ చీరలు, తప్ప రెండోవి వాడరు. అయినా భారతి, తన స్నేహితురాళ్ళు, ఆఫీసుకు కట్టుకొచ్చిన నైలాన్ చీరలను పట్టి, పట్టి చూస్తుంది. ఇలా అంటుంది.

"అబ్బా' ఓసారేమో మావారు, ఒకనైలాన్ చీర తెచ్చారు. అబ్బ! ఎంత బాగుందని, అది కట్టుకున్న రోజున మా బజారంతా నన్ను తెగ మెచ్చుకున్నారు." అంటుంది.

దాదాపు మూడేళ్ళనుండి, భారతి, తన భర్త తెచ్చిన నైలాన్ చీర సంగతి చెబుతుంటే, ఆఫీసులో అందరికీ నవ్వుగా ఉంటుంది. కానీ భారతి మట్టుకు, అదిపట్టించుకోదు. తన భర్త మూడేండ్ల కింద తెచ్చిన చీర సంగతి చెబుతూ, ఆనంద సామ్రాజ్యంలో తేలిపోతుంటుంది.

భారతికి నైలాన్ చీరలంటే గల ఇష్టం చూచి, ఆమె స్నేహితురాళ్ళు ఒక పథకం వేశారు. అప్పుడప్పుడు, ! ఖతటో తారీఖున ఒక చీరల మూట తీసుకొని ఒకడు ఆఫీసు కొస్తుంటాడు. ఆఫీసులో అందరూ కలిసి, ఒక రోజున మూటలవాడ్ని పట్టుకొన్నారు.

# జీవితం

జీవితం
 దివారాత్రులు సంగమించే సంధ్య
 వెలుతురు, చీకటి
 సగం సగం కలసినట్లు,
 సుందర హర్మ్యాల మధురోహలనూ,
 జీర్ణ కుటీరాల నైరాశ్యాన్ని
 కలగలిపి కలవర పెడుతుంది;
జీవితం
 ఎవరో నిర్లక్ష్యంగా విసిరేసిన విత్తు;
 అంకురించిన వెంటనే అది ఆకర్షించే
విధాన్ననుసరించి
 ఉంటుంది దాని పురోగమనం తీరు;
జీవితం
 మహదానందానికి.
 దుర్భర దుఃఖానికి
 రెండు పళ్ళాలు కట్టిన త్రాసు.
 తనిష్టం వచ్చినట్లు.
 తనిష్టం వచ్చిన వైపు మ్రొగ్గుతుంది—
జీవితం
 జీవించి మరణించడానికి;
 చేతనైతే
 సాధించి,
 సరైన సమాధానంతో ముగించడానికి;

దేశం జగన్మోహన్‌రెడ్డి ఎం.ఏ.

వాడితో గీచి, గీచి, బేరం ఆడి, ఒక చీరను, అరవై రూపాయలకు బేరంచేసి భారతికి ఇప్పించదలుచుకున్నారు. డబ్బు అంతా ఒక్క సారి ఇచ్చేలాగున కాక నెలకు ఇరవై రూపాయలు ఇచ్చేట్లుగా బేరం ఆడారు.

భారతి, సంతోషంగా, ఆ చీరను తీసుకొని పట్టి పట్టి చూచింది. తన భుజంపైన వేసుకొని, పరిశీలించుకుంది. ఆఖరుకు నిస్పృహగా. చీరను మూటలవాడి కిచ్చేసింది, 'నాకొద్దంటూ' అంతా ఆశ్చర్యపోయారు. కారణం అడిగారు. నైలాన్ చీరను కట్టుకోనని, నా భర్తకు మాట ఇచ్చాను' అన్నది. అంతా ఆశ్చర్యపోయారు. సంపాదనలేని, కుంటి రామారావు, భార్య సంపాదనను తింటూ, భార్యను ఎంత హింసిస్తున్నాడో తెలుసుకొని వారి కడుపు మండిపోయింది.

"ఆ! అవును! వాడు దుర్మార్గుడు! అప్రయోజకుడు! అసలు వాడు రోజూ, ఐదింటికి, ఆఫీసు కెందుకొస్తాడో తెలుసా? వాడి పెళ్లాన్ని కాపలా కాచుకోడానికి! కుంటి వెధవని తనను ఒదిలి పారిపోతుందేమోనని భయం!" ఇలా తలా ఒక రకంగా అనుకున్నారు.

'నేచర్ అబ్హార్స్ వాక్యూం' అని, ఒక సిద్ధాంతం, ఉంది.

అంటే ప్రకృతిలో అంతా, గాలి నిండి ఉండాలి—ఒకే ఒత్తిడి శక్తితో. అలా ఉన్న గాలిలో, ఒకచోట ఒత్తిడి శక్తి తగ్గితే, చుట్టూ ఉన్న గాలి, దూసుకొని అక్కడికెళ్లి ఒత్తిడి శక్తిని సమంగా ఉండేలా చూస్తుంది. ఐతే అప్పుడే, అక్కడ బ్రహ్మాండమైన తుఫానులు పుట్టి, ప్రకృతిని బీభత్సం చేస్తాయి.

భారతి పనిచేసే ఆఫీసులో సరిగా, అలాగే జరిగింది.

భారతి భర్త అసమర్థుడూ, దుర్మార్గుడూ, భార్యను హింసించేవాడూ అని తేలింది. అంటే భారతి దాంపత్యంలో ఒత్తిడి శక్తి తగ్గిందన్న మాట! అనాటినుండి, ఆ ఆఫీసులోని పురుష పుంగవులు, ఆమె దాంపత్యంలో గల 'ఖాళీ'ని భర్తీ చేయదల్చుకున్నారు!

భారతి స్నేహితురాళ్ళు, ఎలాగైనా, ఆవిడను నైలాన్ చీరను కొనుక్కోమన్నారు. మగ క్లర్క్స్. ఆమెకు అప్పుగా చీరను ఇప్పిస్తామన్నారు. డబ్బు ఉన్నప్పుడు ఇవ్వమన్నారు. ఒకరిద్దరైతే ఉచితంగానే—ఇస్తామని, నోటితో అనకుండా చూపులతో వ్యక్తం చేశారు.

సరిగా ఈసమయంలోనే, కాస్త పైచూపులు అలవాటున్న, ఆఫీసర్‌గారిక్కి. భారతి భర్త కథ, ఆవిడకు నైలాన్ చీరలంటే ఉండే ఇష్టం, సంగతి తెలిసింది. అనాటినుండి, ఆఫీసర్, కిశోర్, భారతిని ప్రత్యేకంగా చూస్తున్నాడు. ఖరీదైన సూట్లను పెట్టెల్లో నుండి బయటకు తీసి, రోజూ పూల రంగడిలాగా తయారై ఆఫీస్ కొస్తున్నాడు. ఆఫీసు విషయాలలో భారతి సలహాలను తీసుకోడం, నడుమ, నడుమ, ఆవిడను ఉబ్బేయ్యడం చేస్తున్నాడు.

క్రమంగా, భారతికి తనంటే, ఇష్టం, ఉన్నదనిపించింది కిశోర్‌కు.

ఒక రోజున, ఐదింటికి, భారతి బయలుదేరింది ఆఫీసునుండి ఇంటి కెళ్ళడానికి. అందరూ వెళ్లి పోతున్నారు. జవాను ఒచ్చి భారతితో "అర్జంటు పని ఉంది, అయ్యగారు మిమ్మలను ఉండమన్నారు!" అన్నాడు.

భారతి నిస్పృహగా, కుర్చీలో కూలబడింది. అందరూ వెళ్ళిపోయారు. ఆఫీసులో కిశోర్, భారతి, జవానులు మాత్రం ఉన్నారు.

భారతి జవానుతో కబురు పంపింది—వాకిట్లో వేచి ఉన్న భర్తకు తనకు పని తగిలింది గనుక ఆలస్యంగా ఇంటి కొస్తానని. జవానువెళ్ళి రామారావుకు సంగతి చెప్పి ఒచ్చాడు.

జవాను ఒక సంచెడు ఫైళ్ళను పట్టుకొని ఒచ్చి, భారతి కిచ్చి, "ఇందులో లెటర్స్ అన్నీ టైప్ చేయమన్నారు అయ్యగారు" అన్నాడు.

భారతి ఆ ఫైళ్లను తీసుకొని టైప్ మిషన్ దగ్గరి కెళ్ళింది.

ఏడు గంటలదాకా, టైప్ చేసింది.

జవాన్, ఫ్లాస్క్‌పట్టుకొని వెళ్ళిపోతూ,

"టైపింగ్ అయ్యాక, తమర్ని రమ్మన్నా రండి!" అని భారతితో అని వెళ్ళిపోయాడు.

భారతి టైప్ చేసిన లెటర్స్‌ను పట్టుకొని, ఆఫీసర్ రూంలో కెళ్ళింది.

"కమాన్! భారతీ! సిట్ డౌన్!" అన్నాడు కిశోర్.

భారతి టైప్డ్ లెటర్స్‌ను కిశోర్ ముందు పెట్టి, ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"సార్! ఇక నేను వెళ్ళొచ్చా?" ఆందోళనగా అడిగింది భారతి. తను ఆలస్యంగా ఇంటికెళ్తే, వంట సరంజామాతో, ఒక్కచేతితో తంటాలుపడే భర్తను ఊహించుకుంటూ.

'జస్ట్ ఎమినిట్!' అంటూ కిశోర్ డ్రాయర్ తెరిచి ఒక పాకెట్‌ను బయటకు తీశాడు. పాకెట్‌ను భారతి ముందుపెట్టి 'చూడు!' అన్నాడు.

భారతి పేకెట్‌ను విప్పి చూచింది.

భారతి కండ్లు, జిగేల్‌మన్నాయి. అందులో రెండు చీరలున్నాయి!

"ఎవరికి సార్? మీయావిడకా?" అని అడిగింది భారతి కండ్లను చీరల మీదినుండి తిప్పకుండానే.

"తీసిచూడు!" అన్నాడు కిశోర్.

భారతి ఉత్సాహంగా, పేకెట్‌లోని చీరలను తీసి, చెరో భుజంమీద వాటిని వేసుకొని చూచుకుంటున్నది.

కిశోర్ కుర్చీలోనుండి లేచి, మెల్లగా భారతిని సమీపిస్తూ అన్నాడు.

"ఇవి మామూలు నైలాన్ చీరలు కావు. స్మగుల్డు టెరిలీన్ దారంతో నేయబడి, పైన ఎంబ్రాయ్‌డరీ చేయబడిన చీరలు. ఒక్కొక్కటి ఐదు వందల రూపాయలు!"

భారతి కిశోర్ మాటలను వింటూ చీరల రంగును, ఎంబ్రాయిడరీ పూలను పట్టి పట్టి చూస్తున్నది. కిశోర్ భారతి వెనుకగా చేరి, ఆమె భుజంమీద చేయివేస్తూ, "బాగుంటే తీసుకో!" అన్నాడు.

తన భుజంమీద చెయ్యిపడగానే, భారతి


యువ నవంబర్ సంచికలో

1978 చక్రపాణి రెండవ అవార్డు పొందిన

శ్రీ ఏ. వి. సత్యనారాయణరావు నవల

'ముడిపడని బంధం'

రెండవ అవార్డు పొందిన

శ్రీ భమిడిపాటి రామగోపాలం కథ

'మనోధర్మం'

ప్రచురింపబడుతాయి

ఉలిక్కిపడి, చివాలున కిశోర్ చేతిని, తన భుజంమీదనుండి విదలించి కొట్టింది.

"సార్!!!"

"పిచ్చిపిల్లా! భయపడకు! కావాలంటే రెండు చీరలూ నీవే తీసుకో! ఇంకా కావాలంటే తెచ్చి పెడతాను. నీ సౌందర్యం, నన్ను పిచ్చివాడ్ని చేసింది. నీ జీతంతో, ఇలాంటి చీరలు నీ జన్మలో కొనుక్కోలేవు. నీ భర్త కొని పెట్టడం సరే!" అన్నాడు ఆవేశంగా కిశోర్.

"సార్! మీరు నన్ను అపార్థం చేసుకొన్నారు. నాకు ఇలాటి చీరలంటే ఇష్టమే కానీ మీ దగ్గరమట్టుకు. తీసుకోను మీరు ఆశించిన విధంగా, తుచ్ఛంగా ప్రవర్తించను" అన్నది భారతి దృఢంగా.

కిశోర్ బిత్తరపోయాడు. ఒక చీర చూస్తేనే భారతి తన ఒళ్ళో వాల్తుందనుకున్నాడు. రెండు చీరలు చూచినా, భారతి చలించదేం?!

"భారతీ! ఇంకా ఇలాంటి చీరలు చాలా తెస్తాను. బంగారు సొమ్ములు కొనిపెడ్తాను. నా కోర్కె తీర్చు."

"ఛీ! ఛీ! ఒక్కనాటికీ అలా జరుగదు!"

"భారతీ! జాగ్రత్తగా ఆలోచించుకో! నన్ను కాదంటే,రేపీపాటికి నిన్ను వూస్ట్ చేయిస్తాను."

"వూస్ట్ చేయించండి! పై వాళ్ళకు కాగితం పెట్టి, మీ పరువు బజారు కీడుస్తాను. మీ శ్రీమతికి, ఈ చీరల సంగతి చెబుతాను!"

భారతిచేసిన మొదటి బెదిరింపు కంటే, రెండో దానికే, కిశోర్ గజగజలాడాడు. ప్లేట్ మార్చాడు.

"భారతీ! ఆలోచించుకో! నీ భర్త కుంటివాడు! అప్రయోజకుడు. నీ సంపాదన తినేవాడు! వాడు నీ ముద్దూ ముచ్చటలేం తీర్చగలడు."

"కిశోర్‌గారూ! నేను పేద దానిని కావచ్చు; మీరు ఇచ్చిన రెండు చీరలకు, మీకు శీలం సమర్పిస్తానని ఎలా అనుకున్నారు? ఇదేనా మీ సంస్కారం? కానీ, నా భర్త సమర్థుడు! ప్రయోజకుడు! మొగవాడు! మీ కంటే సమరుడు! ధైర్యశాలి!"

"వాడా? ఆ కుంటివాడు: నా కంటె సమర్థుడా?"

"అవును!"

"ఎలా?"

"నిరూపిస్తాను. నిరూపించగలితే?"

"క్షమాపణ చెప్పుకుంటాను."

"సరేవినండి! ఈ నైలాన్ టెరిలీన్ చీరలంటే, ఏమనుకుంటున్నారు? మానవ దేహాన్ని బ్రతికుండగనే భస్మం చేయగల 'నాపాం' బాంబులలాంటివి! ఈ చీరలలో వాడే పదార్థానికీ, నాపాం బాంబులతో వాడే పదార్థానికీ, ఒకటే పుట్టిల్లు! ఇవి అంటుకుంటే పెట్రోల్ పోసి నిప్పు అంటించుకున్నట్లే.

ఇవి కట్టుకుంటే నిప్పంటుకుంటే, ఈచీరలు నల్లటి ద్రవ పదార్థంగామారి, మండుతూ, ఉడికిపోతూ, చర్మాన్ని అంటుకొని, చర్మం, కండా, ఎముకా, మాడిపోయే దాకా వదలవు. ఈ చీరలకు నిప్పంటుకుంటే, వాటిని కట్టుకున్న వాళ్ళు చచ్చిపోయినట్లే: ఇలాంటి భయంకరమైన చీరలను కట్టుకొని, ఎంతమంది ఆడ వాళ్ళు చచ్చిపోతున్నారో లెక్కలేదు.

మా వివాహం అయిన కొత్తలో, మావారికి ఒక ప్రముఖ వార పత్రికలో ముఖచిత్రం వేసినందుకు,వందరూపాయలపారితోషికంఇచ్చారు. ఈ చీరలమీద నాకున్న మోజును గ్రహించి, మావారు నాకో మంచి నైలాన్ చీరను కొని తెచ్చి ఇచ్చారు. నేను కాపురానికెళ్ళాక, మా వారు నాకు కొని ఇచ్చిన మొదటి చీర అదే.

ఆ చీరను కట్టుకొని, ఒక ఆదివారంనాడు మా బజార్లో అందరికీ చూపాను. అంతామెచ్చుకొన్నారు. మావారూ బ్రహ్మానందంలో మునిగిపోయారు. కొత్త చీరతో, కాఫీచేసి ఇచ్చి మా వారికి కృతజ్ఞత చెప్పుకుందామనుకొని, వంటింట్లోకెళ్ళి, స్టౌ ముట్టించి, కాఫీ పొడి తీద్దామని వెనక్కు తిరిగాను. చీరకొంగుకు స్టౌ అంటుకుంది గామోలు గప్పున మంటలేచింది. నేను కాఫీపొడి కిందపారేసి, కెవ్వున కేకవేశాను. నా భర్త తుఫాన్‌లాగా ఒచ్చి మండే చీరను

తన చేతికి చుట్టుకొని, నన్ను క్షణంలో వివస్త్రను చేశారు. ఆ తరువాత, చీర వారి చేతికి చుట్టుకొని, భగభగమండుతుంటే. వారు అరుస్తూ, దాన్ని విదిలించుకోడానికి వ్యర్థప్రయత్నం చేశారు.

నా మెడలో మంగళ సూత్రం కట్టిన పవిత్రమైన హస్తం, నన్ను తన సంపాదనతో పోషించే నా భర్త హస్తం, చిత్ర విచిత్రమైన కళా ఖండాలను సృష్టించే మావారిచేయి,— ఆఖరుకు, నాకు నచ్చిన నైలాన్ చీరను తెచ్చిచ్చిన వారి చెయ్యి, నా కండ్ల ముందే, భస్మమైపోతుంటే, నాకు నోటమాట రాలేదు. వారు స్పృహ తప్పిపడిపోయారు. నా జుట్టు చాలా వరకూ కాలిపోయింది. వీపున బొబ్బలెక్కాయి.

ఇద్దర్నీ హాస్పిటల్‌లో చేర్చారు. నేను మూడు రోజులలో బయటపడ్డాను. వారు మూడు వారాలకు బయటకొచ్చారు. కుడిచేయిపోయింది. ఉద్యోగం పోయింది. ఆ తరువాత నేను ఉద్యోగంలో చేరాను.

నా నైలాన్ చీరల ప్రీతి, ఒకసారి నన్ను మరణంలోకి తోసింది. ఇప్పుడు ఇలా పతనంలోకి తోయబోయింది.

ఇప్పుడు చెప్పండి! నా భర్త అసమర్థుడా? నైలాన్ చీరలు కొనడం, ఒక మొగతనంకాదు. దాన్ని నచ్చిన వాళ్ళకు ప్రజంట్‌చేయడం, ఒక ప్రయోజకతకాదు. నైలాన్ చీరలో కాలిపోయే దాన్ని రక్షించే సామర్థ్యం ఉందా మీకు?

చెప్పండి! ఇప్పుడే ఒక చీర కట్టుకొని, నిప్పంటించుకుంటాను. దాన్ని చేతులతో ఆర్ప గలరా?"

భారతి ఉపన్యాసం విని డంగైపోయాడు కిశోర్. మౌనంగా టేబిల్ దగ్గరికొచ్చి, అస్తవ్యస్తంగా టేబిల్‌మీద ఉన్న చీరలను పాక్ చేస్తూ తలవంచుకొని—

"భారతీ! పద! నిన్ను కార్లో డ్రాప్‌చేస్తాను. రామారావుగార్ని పరిచయం చేసుకుంటాను.... ప్లీజ్—ఎక్స్‌క్యూజ్....మీ'' అన్నాడు కిశోర్.

కిశోర్, భారతి, భారతి ఇంటికి చేరారు.

కిశోర్‌ను, రామారావుకు పరిచయం చేసింది భారతి.

కిశోర్, రామారావును ఆరాధనగా చూస్తూ ఇలా అన్నాడు.

"రామారావుగారూ! మీ భార్య చాలా సమర్థురాలు! ఆఫీస్ పనిలో ఆవిడగారు చూపే శ్రద్ధ నాకు నచ్చింది. ఈ రోజు, పని ఎక్కువ ఉన్నందువల్ల, ఆలస్యం అయితే, నా కార్లో డ్రాప్ చేయడానికి వచ్చాను. వస్తాను అంటూ వెళ్ళిపోయాడు, రామారావు కాఫీ తీసుకొని వెళ్ళండి అన్నా వినకుండా.

రామారావు అన్నాడు "సారీ! డియర్! ఈ రోజు వంట చేయలేదు."

"ఆఫీస్ దగ్గర కలుస్తావేమో, సరాసరి, గుడ్డలకొట్ల దగ్గరి కెళ్దాం అనుకున్నాను. నీవు రాలేదు. నేనే వెళ్ళి చాలా శ్రమపడి, ఒక నైలాన్ చీర తెచ్చాను."

"నైలాన్ చీర తెచ్చారా?!"

"అవును! చౌకదేననుకో! ఈ రోజే మన కార్టూన్ల బాపతు పారితోషికం అందింది. తెచ్చాను. మీ ఆఫీసులో వాళ్ళు నిన్ను నైలాన్ చీర అని ఆటలాడించడం విన్నాను.''

"ఏమండీ! ఎందుకు తెచ్చారు? నైలాన్ చీరలు చూడాలంటేనే నాకిష్టం! కానీ కట్టుకోనని నేనే గదా మీతో ప్రమాణం చేశాను?"

"దట్సాల్ రైట్! ప్రమాణానికి, చిన్న అమెండ్‌మెంటు ఇద్దాం? నైలాన్ చీర కట్టుకొని, వంటింట్లోకి వెళ్ళనని సరిక్రొత్త ప్రమాణం చెయ్యి!"

"అలాగేనండీ!" అంది భారతి, ఆరాధనగా భర్తను చూస్తూ.

మెల్లగా భారతి రామారావు ఇచ్చిన పాకెట్ విప్పింది. అందులో ఉన్న చౌకబారు నైలాన్ చీరను చూచి, ఆమె అణువు అణువు పొంగిపోయింది.

"ఇంత అందమైన నైలాన్ చీరను నా జన్మలో చూడ లేదండీ!" అన్నది భారతి.

భారతికోసం ఆఫీసరు తెచ్చిన రెండు చీరలూ ఆమెకు జ్ఞాపకానికే రాలేదు. □